ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
బుధవారం
21 మే
2025






# రేపు యాదగిరిగుట్టలో హనుమాన్ జయంతి మహోత్సవాలు



**యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్:** ఈ నెల 22న హనుమాన్ జయంతి సందర్భంగా.. యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఆంజనేయస్వామి జయంతి మహోత్సవాలు నిర్వహించనున్నారు. యాదగిరిగుట్ట ఆలయానికి క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామి కావడంతో.. ఉత్సవాలు వైభవంగా నిర్వహించడానికి ఆలయ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. జయంతి మహోత్సవాల్లో భాగంగా ఈ నెల 22న కొండపైన విష్ణుపుష్కరిణి పక్కన ఉన్న హనుమాన్ టెంపుల్ లో వైభవంగా, ప్రధానాలయంలో ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో అంతరంగికంగా జయంతి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు మంగళవారం ఆలయ ఈవో వెంకటరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా రేపు ఉదయం 9 గంటలకు అష్టోత్తర శతమన్యసూక్త పారాయణాలచే అభిషేకం, లక్ష తమలపాకులతో సహస్ర నామార్చన వంటి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. రూ.516 టికెట్ పై హనుమంతుడికి లక్ష తమలపాకులతో నిర్వహించే సహస్ర నామార్చన పూజలో పాల్గొనడానికి ఆలయ అధికారులు అవకాశం కల్పించారు. రూ.516 టికెట్ పై దంపతులిద్దరికి మాత్రమే అనుమతి ఉంటుందని ఆలయ అధికారులు వెల్లడించారు.

**అంజన్నకు వైభవంగా ఆకుపూజ**

యాదగిరిగుట్ట నారసింహుడి క్షేత్రంలో క్షేత్రపాలకుడు హనుమంతుడికి ఆకుపూజను అర్చకులు వైభవంగా నిర్వహించారు. కొండపైన విష్ణుపుష్కరిణి పక్కన ఉన్న హనుమాన్ టెంపుల్ లో స్వామివారి మూల విరాట్ ను పవిత్ర జలంతో శుద్ధి చేసి పంచామృతాలతో అభిషేకం చేశారు. అనంతరం సిందూరంతో అందంగా అలంకరించి ప్రత్యేకంగా తెప్పించిన తమలపాకులతో నాగవల్లి దళార్చన చేపట్టారు. అనంతరం ఆంజనేయస్వామికి ఇష్టమైన వడపప్పు, బెల్లం, అరటిపండ్లను నైవేద్యంగా సమర్పించారు.

# నారసింహుడి సేవలో కేసీఆర్ మనవడు హిమాన్షు



యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామిని మాజీ సీఎం కేసీఆర్ మనవడు, మాజీ మంత్రి కేటీఆర్ కొడుకు కల్వకుంట్ల హిమాన్షు మంగళవారం దర్శించుకున్నారు. ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతా మహేందర్ రెడ్డితో కలిసి గర్భగుడిలో స్వయంభూ నారసింహుడిని దర్శించుకుని ముఖ మంటపంలో స్వామివారి ఉత్సవమూర్తులకు అష్టోత్తర పూజలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన ఆయనకు ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వచన మండపంలో అర్చకులు ఆయనకు వేదాశీర్వచనం చేయగా.. ఆలయ ఆఫీసర్లు లడ్డూప్రసాదం, స్వామివారి శేషవస్త్రాలు అందజేశారు. అంతకుముందు స్వామివారి దర్శనం కోసం యాదగిరిగుట్టకు వచ్చిన హిమాన్షుకు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత ఆధ్వర్యంలో బీఆర్ఎస్ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కర్రె వెంకటయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ రవీందర్ గౌడ్, మాజీ జెడ్పీటీసీ అనురాధ, మాజీ సర్పంచ్ బీరయ్య, స్థానిక బీఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

# కేంద్రం తెచ్చిన లేబర్ కోడ్ లను రద్దు చేయాలి

**సీఐటీయూ జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేశం**



యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: కార్మికుల పాలిట శాపంగా మారిన కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్ లను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేశం డిమాండ్ చేశారు. కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ జాతీయ కార్మిక సంఘాల పిలుపు మేరకు.. మంగళవారం యాదగిరిగుట్టలో సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీ, హెచ్ఎంఎస్, బీఆర్టీయూ, టీఎస్టీయూ సంఘాల ఆధ్వర్యంలో వైకుంఠ ద్వారం నుండి ఎంపీడీవో కార్యాలయం వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కార్మికులు పోరాడి సాధించుకున్న 29 చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసి కార్మికుల పొట్ట కొట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రం కార్మికుల పనిగంటలను.. 8 నుండి 12 గంటలకు పెంచడం కారణంగా.. కంపెనీ యాజమాన్యాలు యథేచ్ఛగా కార్మికుల శ్రమ దోపిడీకి పాల్పడుతున్నాయని, ఫిక్సుడ్ టర్మ్ ఎంప్లాయ్ విధానాన్ని తెచ్చి కార్మికుల హక్కులను కాలరాసిందని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వ విధానాలపై జులై 9న దేశవ్యాప్త సమ్మెలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని సక్సెస్ చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాములు, ఐఎన్టీయూసీ మండల అధ్యక్షుడు మురళీ, హెచ్ఎంఎస్ రాష్ట్ర నాయకుడు శ్రీనివాస్, టీఎస్టీయూ రాష్ట్ర నాయకుడు రేగు బాలనర్సయ్య, బీఆర్టీయూ నాయకులు నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులకు శిక్షణతోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య

## యాదగిరిగుట్ట ఎంఈఓ యామిని శరత్





**యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్:** ఉపాధ్యాయులు శిక్షణలను సద్వినియోగం చేసుకొని వృత్తిలో రాటుదేలాలని యాదగిరిగుట్ట మండల విద్యాశాఖ అధికారి శరత్ యామిని అన్నారు. యాదగిరిగుట్ట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐదు రోజుల ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమాలను మంగళవారం ప్రారంభించి ప్రసంగించారు. ఉపాధ్యాయులు శిక్షణ పొందితేనే గుణాత్మక విద్యను, నాణ్యమైన విద్యను అందించగలుగుతారని ఆమె చెప్పారు. సరికొత్త వ్యూహాలను అందిపుచ్చుకోవడం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి అవకాశం కలుగుతుందని చెప్పారు. గ్రామీణ ప్రాంతాలలో ఎక్కువ మంది ప్రభుత్వ పాఠశాలలోనే విద్యను అభ్యసిస్తున్నారని, వారికి నాణ్యమైన విద్యను అందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉన్నదని ఆమె గుర్తు చేశారు.

ఉన్నత పాఠశాల స్థాయి తెలుగు రిసోర్స్ పర్సన్ గా బాలసుబ్రమణ్యం, పి, నాగలింగం, కే మనోహర్, ఎస్. నాగమణి, అరవిందరాయుడు బాలల లక్ష్మీ వ్యవహరించారు. ప్రాథమిక స్థాయి రిసోర్స్ పర్సన్ గా జి వెంకటేష్, కొండల్ రెడ్డి, శ్రీకాంత్, రాధాకృష్ణ, పాండురంగం, నరసింహస్వామి, లావణ్య లతా, సంధ్య వ్యవహరించారని కోర్సు ఇన్చార్జి యామిని వివరించారు. ఈ కార్యక్రమంలో సిఆర్పిలు ఎం సంగీత, రమేష్, బిక్షపతి, శివ, భాస్కర్, సంజీవ తదితరులు పాల్గొన్నారు.

# విత్తనాల ధరలు పెంచొద్దు...

**అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు**

**జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా హెచ్చరిక**



**జనగామ, మే, 20 (రోమింగ్ న్యూస్) :** జనగామ జిల్లా వ్యాప్తంగా రైతులకు విత్తనాలను ఎరువులను అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జనగామ జిల్లా కలెక్టర్ హెచ్చరించారు. గరిష్ట చిల్లర ధర (ఎంఆర్పీ)కే విత్తనాలు, ఎరువులను విక్రయించాలని ఆయన గట్టిగా నొక్కి చెప్పారు. స్టాక్ ధరల పట్టిక బోర్డును తప్పనిసరిగా ప్రదర్శించాలని ఆయన అధికారులకు ఆదేశాలు జారీ చేశారు విత్తనాలు, ఎరువుల దుకాణాల పర్యవేక్షణ క్రమం తప్పకుండా జరగాలని ఆయన అధికారులకు తగిన సూచనలు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ జిల్లా లో మంగళవారం ఆకస్మిక తనిఖీలు చేస్తూ పర్యటనలు చేశారు మంగళవారం జిల్లాలోని ఘనపూర్ స్టేషన్ నియోజకవర్గంలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం – II, అలాగే తిరుమల ఫెర్టిలైజర్స్ దుకాణాలను అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రోహిత్ సింగ్ తో కలిసి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సందర్శించి, ఆకస్మిక తనిఖీ చేపట్టారుఈ సందర్భంగా విత్తనాలు, ఎరువుల క్రయవిక్రయాలు, రైతుల కొనుగోలు వివరాల రిజిస్టర్లను తనిఖీ చేసి, రోజూవారీ విక్రయాల గురించి ఆరా తీశారు. రైతులకు కొనుగోళ్ల బిల్లులను ఖచ్చితంగా అందించాలన్నారు. అన్ని రికార్డులను ఎప్పటికప్పుడు సరైన విధంగా నిర్వహించాలని సూచించారు. అదే విధంగా వివిధ కంపెనీలకు చెందిన విత్తనాలను పరిశీలించి, నకిలీ విత్తనాలను అమ్మరాదని, రైతులకు గరిష్ట చిల్లర ధర (MRP) కు నాణ్యమైన విత్తనాలను మాత్రమే విక్రయించాలని తెలిపారు. స్టాక్ నిల్వలను పరిశీలించి, యూరియా బస్తాలు, జీలుగు విత్తనాలు, ఇతర ఎరువుల వివరాల గురించి అడిగి తెలుసుకున్నారు. స్టాక్ నిల్వలకు సంబంధించి ధరల పట్టిక వివరాలను బోర్డుపై తప్పనిసరిగా ప్రదర్శించాలన్నారు. ఈ తనిఖీలో కలెక్టర్ వెంట డీఏఓ రామారావు నాయక్, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఏఓ చంద్రన్ కుమార్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# జనగామ సేవనే మా లక్ష్యం

**ఉచిత మెగా వైద్య శిబిరం సక్సెస్**

**జీవన్ గ్రీన్ హోప్ సొసైటీ కి అభినందనలు**



జనగామ మే 20: (రోమింగ్ న్యూస్) జనగామ జిల్లా కేంద్రంలో మంగళవారం జీవన్ గ్రీన్ హోప్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ ద్వారా జరిగిన ఉచిత మెగా వైద్య శిబిరం సక్సెస్ అయిందని దీనికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలుపుతున్నామని సంస్థ నిర్వాహకురాలు దూసరి ధనలక్ష్మి శ్రీకాంత్ పేర్కొన్నారు. జనగామలో అనేక రకాల సేవలు చేయాలని, సమాజానికి విద్యా, వైద్య, పర్యావరణ పరిరక్షణ, ఉద్యోగ పరంగా సహాయం అందిచడమే జీవన్ గ్రీన్ హోప్ ముఖ్య ఉద్దేశం అని ఆ క్రమంలోనే జీవన్ గ్రీన్ హోప్ సొసైటీ కృషి చేస్తుందని వారు అన్నారు జనగామ జిల్లా కేంద్రం లోని 14వ వార్డ్ అంబేద్కర్ నగర్ లో హైదరాబాద్ కు చెందిన మల్లారెడ్డి నారాయణ ప్రముఖ హాస్పిటల్ వారి సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ ఉచిత శిబిరంలో దాదాపు 450 మంది కి ఉచిత వైద్య పరీక్షలు చేయడం జరిగిందని, తమ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవడం సంతోషంగా ఉందని వారు తెలిపారు. ఈ సందర్భంగా జనగామ ప్రిస్టన్ ఇన్స్టిట్యూట్ కు చెందిన ప్రముఖ సామాజిక సేవకులు జాన్ సార్ మరియు జనగామ మున్సిపల్ మాజీ చైర్మన్ వేమల్ల సత్యనారాయణ రెడ్డి తదితరులు మాట్లాడుతూ జనగామలో ప్రముఖ వైద్యుల చే ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించిన సొసైటీ నిర్వాహకులను అభినందిస్తూ ఆశీర్వదించారు. అనంతరం సంస్థ చైర్మన్ ధనలక్ష్మి మాట్లాడుతూ ఈ రోజు శిబిరానికి హాజరైన వారిలో స్కాన్లు,ఎక్స్‌రేలు, కంటి శస్త్రచికిత్సలు,ఎముకల సంబంధిత శస్త్ర చికిత్సలు అవసరమైనవారిని రేపు మల్లారెడ్డి మల్టీ స్పెషలిటీ హాస్పిటల్‌కు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సు ద్వారా తీసుకెళ్లనున్నామని తెలిపారు. వారికి భోజనవసతి తో పాటు వైద్య సహాయం అందిన తర్వాత తిరిగి జనగాం కు తీసుకుని వస్తామని మీడియాకు వివరించారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా ఇంకా అనేక మంది ప్రముఖులు అందిస్తున్న ప్రోత్సాహంతో , ప్రేరణ తో ఇలాంటి సేవ కార్యక్రమాలు ఇంకా చేయాలనే తపన కలిగిందని తెలిపారు.

ఈ శిబిరంలో విశేష సేవలు అందించిన 10 మంది ప్రత్యేక వైద్యులను జీవిత గ్రీన్ హోప్ సొసైటీ తరఫున శాలువాతో సత్కరించడం జరిగిందని, సామాజిక సేవల ద్వారా సమాజానికి మంచి కార్యాన్ని చేయాలని, పేదవారికి సహాయం చేయాలన్న లక్ష్యంతో తమ జీవన్ గ్రీన్ హోప్ సొసైటీ పని చేస్తోందని తెలిపారు, ఎవరైనా పేదవారికి సహాయం చేయాలనుకునే దాతలు ముందుకు వచ్చి తమ జీవన్ గ్రీన్ హోప్ సొసైటీ సంప్రదించగలరని, జీవన్ గ్రీన్ హోప్ సొసైటీ యొక్క ముఖ్య ఉద్దేశం విద్యా, వైద్య, పర్యావరణ పరిరక్షణ, ఉద్యోగ అవకాశాల లో సహాయం అందించడం అని తెలిపారు.

